క్లుప్తంగా

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తం



రక్షణ దుస్తులు పంపిణీ చేస్తున్న ఏఈ రవికుమార్

ఆమదాలవలస రూరల్: విద్యుత్ ప్రమాదాలపై ప్రజలను అప్రమత్తం చేస్తూ సిబ్బంది తగిన జాగ్రత్తలు పాటించాలని ఎలక్ట్రికల్ రూరల్ ఏఈ బి.రవికుమార్ తెలిపారు. మండల కేంద్రంలో గల రూరల్ విద్యుత్ కార్యాలయంలో విద్యుత్ లైన్‌మన్లకు రక్షణ దుస్తులను బుధవారం పంపిణీ చేశారు. ప్రభుత్వం నుంచి సరఫరా చేసిన రక్షణ దుస్తులు, వస్తువులను ఉపయోగించి విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. విద్యుత్ సిబ్బంది గ్రామాల్లో అందుబాటులో ఉండాలన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న బూర్లె శ్రీనివాసరావు, కుటుంబ సభ్యులు

కొత్తూరు: మండలంలోని నేరడి గ్రామంలో నిర్మిస్తున్న రామాలయానికి మెట్టూరు బిట్-1 (పాడలి) గ్రామానికి చెందిన బూర్లె రామ్మూర్తి నాయుడు జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు విరాళం అందజేశారు. ఆయన భార్య అచ్చెమ్మ, కుమారులు శ్రీనివాసరావు, కృష్ణారావు రూ.20,116లను కమిటీ సభ్యులకు బుధవారం అందజేశారు. రామ్మూర్తినాయుడు కుటుంబానికి ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా ఆలయ ప్రతిష్ట



క్షీరాదివాసం చేస్తున్న భక్తులు

సారవకోట: మండలంలోని చిన్నకిట్టాలపాడులో పాతపట్నం అమ్మతల్లి ఆలయ ప్రతిష్ట మహోత్సవాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవ మూర్తులను గ్రామదర్శనం, ధాన్యాది వాసం, జలాదీ వాసం, క్షీరాధి వాసం చేపట్టారు. గ్రామస్తులు సుమారు రూ.4 లక్షల వ్యయంతో ఈ ఆలయ నిర్మాణం చేపట్టారు. గ్రామస్తులు, భక్తులు అమ్మతల్లిని దర్శించుకుని పూజలు చేశారు.

రొంపివలసలో ఫ్యామిలీ డాక్టర్



వైద్య సేవలు అందజేస్తున్న వైద్యుడు శ్రీధర్

పాతపట్నం: మండలంలోని రొంపివలస గ్రామంలో బైదలాపురం పీహెచ్‌సీ వైద్యుడు ఐ.శ్రీధర్ ఆధ్వర్యంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలతోపాటు మంచం పట్టిన రోగులు, బీపీ, సుగర్ వంటి సమస్యలతో బాధపడుతున్నవారికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులను అందజేశారు. ఆస్పత్రి సిబ్బంది బాబూరావు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రీసర్వేకు రైతులు సహకరించాలి

హిరమండలం: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు– భూ రక్ష పథకం ద్వారా చేపడుతున్న భూ సర్వేలకు రైతులు సహకరించాలని తహసీల్దార్ బి.మురళీమోహన్‌రావు కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయలంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. మండలంలోని అంతిలి రెవెన్యూ పరిధిలో 85 శాతం మేర భూ సర్వే పూర్తయిందని, మిగతా సర్వేకు రైతులు సహకరించాలన్నారు. శతశాతం సర్వే చేసేందుకు రెవెన్యూ సిబ్బందిని బృందాలుగా వేయడం జరిగిందన్నారు. ఈ బృందాలకు రైతుల వద్ద ఉన్న భూములకు సంబంధించిన పత్రాలను చూపించి సహకరించాలన్నారు. సరైన వివరాలు అందిస్తే పారదర్శకంగా సర్వే పూర్తి చేస్తామన్నారు. భూ సర్వేకు సంబంధించిన సందేహాలకు నివృత్తి చేసుకునేందుకు రైతులు తమ వద్ద ఉన్న భూపత్రాలతో తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఆరు గంటలు పని చేయాలి

సారవకోట: ఉపాధి వేతనదారులు రోజుకు ఆరు గంటలు పని చేసేలా చూడాలని ఉపాధి హామీ పథకం నరసన్నపేట క్లస్టర్ ఏపీడీ ఎం.శైలజ సూచించారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. పని చేసే ప్రదేశంలో మార్కింగ్ ఇవ్వాలన్నారు. మార్చి నెలాఖరు నాటికి వేతనదారులందరికీ 100 రోజులు పని కల్పించాలని, గరిష్ఠ వేతనం రూ 257 వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీఓ విశ్వేశ్వరరావు, ఏపీఓ సత్యమూర్తి ఉన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

- రక్తహీనతపై ప్రత్యేక దృష్టి
- గర్భిణుల్లో రక్తహీనత నివారణే ప్రధాన ధ్యేయం

ఎనిమియాతో బాధపడుతున్న గర్భిణులు, బాలింతల వివరాలు..

మండలం	గర్భిణీలు	బాలింతలు
సారవకోట	66	23
పాతపట్నం	68	21
మెళియాపుట్టి	98	34
జలుమూరు	92	31
ఆమదాలవలస	38	05
ఎల్‌ఎన్‌పేట	15	03
సరుబుజ్జిలి	19	16



సారవకోట పీహెచ్‌సీలో గర్భిణికి హెచ్‌బీ పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది

సారవకోట: ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు.. నేపథ్యంలో గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణకు వైద్య ఆరోగ్య శాఖ, ఐసీడీఎస్ ద్వారా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. వీటిలో రక్తహీనతను మైల్డ్, మోడరేట్, సివియర్ అనే మూడు విధాలుగా విభజించి ఆయా కేటాగిరిలకు తగ్గట్టుగా శ్రద్ధ చూపిస్తున్నారు.

ఐసీడీఎస్, వైద్యశాఖల ద్వారా మాత్రల పంపిణీ..

రక్తహీనత అధికంగా ఉన్న గర్భిణులకు.. సంబంధిత సీహెచ్‌ల్లో ఉన్న గైనకాలజిస్టుల సూచనల మేరకు ఆయా పీహెచ్‌సీ వైద్యుల పర్యవేక్షణలో ఐరన్, సుక్రోజ్ ఇంజన్లు వేస్తున్నారు. మోడరేట్ ఉన్న గర్భిణులకు అవసరం మేరకు ఈ ఐరన్, సుక్రోజ్ ఇంజక్షన్లు అందించడం, ప్రతీరోజు ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐరన్, ఫోలిక్ ఆసిడ్ మాత్రలు అందించడం జరుగుతుంది. అంగన్‌వాడీ కార్యకర్తలకు మొబైల్ యాప్‌లో ఏనిమియా మేనేజ్‌మెంట్ అని ఏర్పాటు చేసి పౌష్టికాహారం, వైద్య శాఖ ద్వారా మాత్రలు అందిస్తున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న ఏనిమియా మేనేజ్‌మెంట్‌ను సంబంధిత సూపర్‌వైజర్, వైద్య సిబ్బంది పర్యవేక్షించేలా ఏర్పాటు చేశారు. గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారించే చర్యలు తీసుకుంటున్నారు. ప్రతీ నెల 9వ తేదీన ప్రభుత్వ ఆస్పత్రుల్లో గర్భిణులకు ప్రత్యేకంగా వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణకు గ్రామ స్థాయి వైద్య సిబ్బంది ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. రక్త హీనతకు గురైన వారికి తగిన వైద్య చికిత్సతోపాటు సలహాలు, సూచనలు తెలియజేస్తున్నాం. గర్భం దాల్చిన నాటి నుంచి సమతుల్య ఆహారం తీసుకుంటే రక్తహీనతను నివారించవచ్చు.

– సృజనీకుమారి, గైనకాలజిస్టు, బుడితి సీహెచ్‌సీ

మత్తుపదార్థాలతో జీవితాలు నాశనం

- ఎస్‌ఈబీ సీఐ లక్ష్మునాయుడు



మాట్లాడుతున్న ఎస్‌ఈబీ సీఐ లక్ష్మునాయుడు

పాతపట్నం: నాటు సారా, గంజాయి వంటి మత్తుపదార్థాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దని పాతపట్నం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఎస్‌ఈబీ) సీఐ వై.లక్ష్మునాయుడు అన్నారు. పాతపట్నం ప్రభుత్వ మోడల్ కళాశాలలో ఎస్‌ఈబీ ఆధ్వర్యంలో మత్తుపదార్థాలపై విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహిచారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సారా, గంజాయి, డ్రగ్స్‌ను వినియోగించినా, రవాణా చేసినా 14500 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు, వైస్ ప్రిన్సిపాల్ చక్రవతి, ఎస్‌ఈబీ ఎస్‌ఐ దస్తగిరి, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల భద్రత.. మా బాధ్యత



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పాతపట్నం: మహిళలకు భద్రత కల్పించడమే మా బాధ్యత అనే నినాదంతో ముందుకు వెళ్తున్నామని ఎస్‌ఐ ఎస్.కామేశ్వరరావు అన్నారు. జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో రూపొందించిన స్ఫూర్తి కార్యక్రమంలో భాగంగా పాతపట్నం మేజర్ పంచాయతీలోని కోటగుడి కాలనీ, కాగువాడ గ్రామంలో బుధవారం రాత్రి కళారూపాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఆటోడ్రై వర్లకు, ప్రయాణికులకు, మహిళలకు అప్రమత్తతపై అవగాహన కల్పించారు. మహిళలకు గౌరవించడం మన బాధ్యత అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎస్ ప్రదీప్, రాజా, పోలీసులు, సచివాలయ మహిళా పోలీసులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ముగిసిన నవగ్రహాల ప్రతిష్ట మహోత్సవం



భక్తులకు భోజనాలు వడ్డిస్తున్న ధర్మాన పద్మప్రియ

నరసన్నపేట: స్థానిక పాతబస్టాండ్‌లోని ఉమామహేశ్వరాలయంలో నిర్మించిన నవగ్రహ మండపం, విగ్రహాల ప్రతిష్ట మహోత్సవం బుధవారంతో ముగిసింది. చివరిరోజున వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యురాలు ధర్మాన పద్మప్రియ, జెడ్పీటీసీ చింతు అన్నపూర్ణ ప్రత్యేక పూజలు చేశారు. మండపం నిర్మాణం, విగ్రహాల వితరణ చేయడమే కాకుండా ఆలయానికి హంగులు తీర్చిదిద్దిన మార్పు విజయకుమార్‌ను పద్మప్రియ అభినందించారు. అన్నదాన కార్యక్రమంలో పద్మప్రియ పాల్గొని వడ్డించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చింతు రామారావు, రాజాప్పన్న, నరసన్నపేట ఉప సర్పంచ్ ఎస్.కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

బాలరాజుకు ఉగాది నంది పురస్కారం



బాలరాజు

హిరమండలం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమీ, శ్రీశ్రీ అంతర్జాతీయ కళావేదిక సౌజన్యంతో గోదావరి ఉత్సవ్ పేరిట నిర్వహించే ఉగాది నంది పురస్కారానికి హిరమండలం మండలం దుర్బలాపురం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు ముద్దాడ బాలరాజు ఎంపిక య్యారు. ఈ మేరకు ఆయన బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయుడిగా, బోధనా విధానాల విశ్లేషకునిగా, పోటీ పరీక్షల నిపుణుడిగా, పుస్తక రచయితగా, విద్య, సామాజిక రంగాల్లో చేస్తున్న కృషిని గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేశారన్నారు. ఈ నెల 19న రాజమహేంద్రవరంలో ప్రముఖుల సమక్షంలో అవార్డు అందజేస్తారన్నారు. విద్యార్థులు, నిరుద్యోగుల అభ్యున్నతి కోసం నిరంతరం కృషిచేసే బాలరాజుకు పురస్కారానికి ఎంపిక కావడంపై స్థానిక ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు హర్షం వ్యక్తంచేశారు.

భక్తిశ్రద్ధలతో సూర్యనమస్కారాలు



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

నరసన్నపేట: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో బుధవారం సూర్య ఉపాసకులు జోష్యుల సుబ్రహ్మణ్యశర్మ ప్రత్యేకంగా సూర్యనమస్కారాలను నిర్వహించారు. మీన సంక్రమణ పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జోష్యుల అనంత శర్మ, కృష్ణ శర్మ, బంకుపల్లి జనార్దన శర్మ పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో మెరుగైన ఆరోగ్యం



ఫిజియోథెరపీ సేవలు అందజేస్తున్న వైద్యురాలు లక్ష్మీప్రసన్న

ఆమదాలవలస రూరల్: ప్రత్యేక అవసరాల పిల్లలకు క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ చేయడం వల్ల మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని ఫిజియోథెరపీ వైద్యురాలు బొడ్డేపల్లి లక్ష్మీప్రసన్న తెలిపారు. మండలంలోని భవిత కేంద్రంలో బుధవారం ప్రత్యేక అవసరాల చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. చిన్నారులపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ఇంటి వద్ద వ్యాయామం చేయించాలని సూచించారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రభుత్వం సౌకర్యాలు కల్పిస్తూ చేయూత అందించడం జరుగుతుందన్నారు. మండల కేంద్రంలో ప్రతి బుధవారం ఈ సేవలను అందించడం జరుగుతుందన్నారు. ఐఈఆర్ ఉపాధ్యాయులు పూజారి శ్రీధర్, పి.కృష్ణప్రసాద్ ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



సారవకోట: ప్రకృతి వ్యవసాయంపై ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు, సిబ్బంది)



పాతపట్నం: రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సారవకోట: మండలంలోని అలుదు పంచాయతీ మాకివలస గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై ప్రకృతి వ్యవసాయం సిబ్బంది అవగాహన కల్పించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. 30 రకాల విత్తనాలతో నేలను ఏ విధంగా బాగు చేసుకోవాలో తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు రావాడ శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో మేలు



ఎల్.ఎన్.పేట: భూసార పరీక్షలు చేస్తున్న సెంట్రల్ టీం సభ్యులు

ఎల్.ఎన్.పేట: ప్రతీ ఏడాది భూసార పరీక్షలను నిర్వహించి భూమిలో లోపించిన పోషకాలను సేంద్రియ ఎరువుల ద్వారా వేసుకోవటం వల్ల అధిక దిగుబడులను సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం శంభో దిని జర్మనీ సెంట్రల్ టీం సభ్యులు లక్ష్మణ్, శ్రీకాంత్ అన్నారు. మండలంలోని యంబరాం గ్రామానికి చెందిన ప్రకృతి వ్యవసాయ సాగు రైతు పెనుమజ్జి శ్రీనివాసరావు పొలంలో బుధవారం భూసార పరీక్షలకు నిర్వహించారు. అధికంగా రసాయన ఎరువులు, పురుగుల మందులు వినియోగించటం వల్ల భూసారం తగ్గిపోతుందన్నారు. ఆవుపేడ, కుళ్లిన గత్తం, కట్టిజనుము, నవధాన్యాల సాగు, చెరువు మట్టి వేసుకోవాలని రైతులకు అవగాహన కలిగించారు. మండల కోఆర్డినేటర్ ఎం.పద్మావతి, ఐసీఆర్పీ పవన్, అనందరావు, జ్యోతి, పూర్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రహరాజపాలెంలో

పాతపట్నం: ఖరీఫ్, రబీ పంటలు సాగుచేసిన తరువాత రెండు నెలలపాటు ఎటువంటి పంటలు వేయకుండా విడిచి పెట్టడం వల్ల భూమిలో ఉన్న సూక్ష్మజీవులు మృతి చెందడంతో భూసారం కోల్పోతుందని సెంచూరియన్ యూనివర్సిటీ అగ్రికల్చర్ సీనియర్ విద్యార్థులు పేర్కొన్నారు. మండలంలోని ప్రహరాజపాలెం గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై బుధవారం అవగాహన కల్పించారు. విత్తన తయారీ నుంచి పంట కొనుగోలు వరకు రైతులకు ప్రభుత్వం అందుబాటులో ఉంటుందన్నారు. సి.హెచ్.నవీన్, సాయి సందీప్, రైతులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



నరసన్నపేట: జ్ఞానజ్యోతి కళాశాలలో పరీక్షల రాసేందుకు వచ్చిన విద్యార్థులు



పాతపట్నం: ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ వినోద్ కుమార్



జలుమూరు: ప్రభుత్వ జూనియర్ కాలేజీలో రూమ్‌లు సరిచూసుకుంటున్న విద్యార్థులు



హిరమండలం: పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు



కొత్తూరు: ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పరీక్షకు హాజరైన విద్యార్థులు



బూర్జ: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు



సారవకోట: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షకు హాజరైన విద్యార్థులు

ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పబ్లిక్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. విద్యార్థులు ఉదయం 8.30 గంటలకే పరీక్షల కేంద్రాల వద్దకు చేరుకున్నారు. పరీక్ష సమయం ముగిసే వరకు కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. హిరమండలం మండలంలో 697 మంది విద్యార్థులకు 55 మంది, మెళియాపుట్టిలో 464 మందికి 30 మంది, కొత్తూరులో 425 మందికి 24 మంది, నరసన్నపేట 1482 మందికి 31 మంది, సారవకోటలో 97 మందికి ఒక్కరు, జలుమూరులో 290 మందికి ఐదుగురు, ఆమదాలవలసలో 508 మందికి 13 మంది, పొందూరులో 1261 మందికి 62 మంది, బూర్జలో 305 మందికి ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారు.

– సాక్షి నెట్‌వర్క్

భూ ఆక్రమణపై ఎంపీటీసీకి నోటీసులు



ఆక్రమణలను పరిశీలిస్తున్న తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది

బూర్జ: మండలంలోని తోటవాడ రెవెన్యూ పరిధి కొల్లివలస గ్రామం దగ్గర ముచిడిక కర్ర చెరువును (సర్వే నంబర్ 3–95) ఆక్రమించి నిర్మాణం చేపడుతున్న జనసేన్ పార్టీ టీ.డీ.ఆర్.రాజుపేట ఎంపీటీసీ అంపిలి విక్రమ్‌కు రెవెన్యూ అధికారులు బుధవారం నోటీసులు ఇచ్చి నిలుపుదల చేయించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు తహసీల్దార్ ఎస్.రమణారావు బుధవారం గ్రామానికి వెళ్లి పరిశీలించారు. సుమారు 10 సెంట్ల స్థలం ఆక్రమణకు గురైందని, సెంటు రూ.10 లక్షలు ఉంటుందని పోలీసులు ఫిర్యాదు అందడంతో ఎస్‌ఐ బి.అశోక్ బాబు, సిబ్బంది వెళ్లి నిర్మాణ దశలో పిల్లర్లను తాత్కాలికంగా నిలుపుదల చేశారు. విక్రమ్ నాలుగు రోజులు గడువు అడగడంతో రెవెన్యూ, పోలీస్ సిబ్బంది వెనుదిరిగారు. కొన్ని ఏళ్ల నుంచి విక్రమ్‌కు సంబంధించిన షాపులు ఉన్నాయని, కొంత చెరువు గట్టు స్థలం, కొంత రహదారి స్థలం ఆక్రమించారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

సంక్షిప్తంగా...

నిందితులను అరెస్టు చేయాలి



మాట్లాడుతున్న కొత్తూరు మండల నాయకులు

కొత్తూరు: జిల్లాలో వరుసగా దళితలను హత్య చేసిన నిందితులను పోలీసులు అరెస్టు చేసి, బాధితులకు న్యాయం చేయాలని మండల దళిత మహాసభ అధ్యక్షుడు టొంపల తిరుపతిరావు, కన్వీనర్ పడాల నాగభూషణరావు కోరారు. కొత్తూరులో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల ఎచ్చెర్ల మండలం చిలకపాలెం గ్రామానికి చెందిన లింగాల నరేంద్ర, బూర్జ మండలం నీలంపేట గ్రామానికి చెందిన జమ్మాన సుదర్శన్‌లు హత్యకు గురైనట్లు చెప్పారు. ఇంతవరకు నిందితులను పోలీసులు పట్టుకోలేదన్నారు. పోలీసుల జాప్యం చేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు. దళిత నేతలు జి.రామారావు, బి.రామకృష్ణ, ఎన్.జగజ్జీవనరావు, ఎం.శంకరరావు పాల్గొన్నారు.

రహదారి నిబంధనలు పాటించాలి

కొత్తూరు: రహదారి నిబంధనలు వాహనదారులు విధిగా పాటించాలని కొత్తూరు సీఐ వేణుగోపాలరావు తెలిపారు. కొత్తూరు నాలుగు రోడ్ల కూడలిలో బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. మద్యం సేవించి, సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ, హెల్మెట్ లేకుండా, త్రిబుల్ డ్రైవింగ్ చేసేవారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. వాహన పత్రాలతోపాటు డ్రైవింగ్ లైసెన్స్ లేనివారి నుంచి అపరాధ రుసుం వసూలు చేశారు.

23 నుంచి సీతారామాలయం ప్రతిష్ట ఉత్సవాలు

నరసన్నపేట: మండల కేంద్రంలోని రాజీవ్ నగర్ కాలనీలో నిర్మించిన రామాలయం ప్రతిష్ట మహోత్సవాలు ఈ నెల 23, 24వ తేదీల్లో నిర్వహించనున్నామని ఉత్సవాల కమిటీ ప్రతినిధి పతివాడ గిరీశ్వరరావు బుధవారం తెలిపారు. సీతారామలక్ష్మణ, ఆంజనేయ స్వామి విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. వివిధ పూజా, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని భక్తులు పాల్గొనాలని కోరారు. సీతారామ కల్యాణ మహోత్సవం ఉంటుందన్నారు.